క్లుప్తంగా

ఉన్నత పాఠశాలగా మార్చాలని వినతి



గూడూరు:మండల పరిధిలోని పోలవరం గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చాలని గ్రామ మాజీ సర్పంచ్ కారుపర్తి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఐదో తరగతి వరకు మాత్రమే ఉందని, గతంలో యూపీ పాఠశాలగా ఉండేదన్నారు. విద్యార్థులు ఆరో తరగతి నుంచి మల్లవోలు హైస్కూలుకు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. విద్యార్థుల దూరాభారాన్ని తగ్గించి ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా అభివృద్ధి చేయాలని కోరారు.

శ్రీకాకుళేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్



శ్రీకాకుళం(ఘంటసాల):ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో వేంచేసియున్న ఆంధ్ర మహావిష్ణువుగా బాసిల్లుతున్న శ్రీకాకుళేశ్వర స్వామి వారిని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, యువనేత మండలి వెంకట్రామ్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఈవో దాసరి శ్రీరామ వరప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయాధికారులు వేద పండితులు ఎమ్మెల్యేను సత్కరించి స్వామి వారి ప్రసాదం అందించారు.

కాలవగట్టు రోడ్డుకు మరమ్మతులు



మోపిదేవి: మండల కేంద్రంలోని కాలవగట్టు రోడ్డుపై ఉన్న చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించి, గుంతలను పూడ్చించి మరమ్మతులు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి తెలిపారు. స్థానికులు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చేసిన విన్నపం మేరకు పనులు చేశామన్నారు. గ్రామస్తులు నందిగం అభిషేకరావు, శ్రీను, శ్రీనివాసరావు, మునేశ్వరావు, కిషోర్‌బాబు, కోరాబత్తిన శ్రీనివాసరావు, దోవారి కోటేశ్వరావు, కర్లపూడి సుబ్బారావు, తదితరులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



పెడన:రిలియన్స్ స్మార్ట్ బజారు ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని తేజస్వినికి స్థానిక ప్రముఖులైన నారగాని నాగరాజు, ద్వితీయ బహుమతి సంధ్యకు తాతా వీరబాబు, తృతీయ బహుమతులు రమ్య, కావ్యలకు ఇద్దరికి రిలయన్స్ మార్ట్ మేనేజర్ జి. విష్ణు అందజేశారు.

కె.కొత్తపాలెంలో వరి కుప్ప దహనం



కె.కొత్తపాలెం(మోపిదేవి):గ్రామంలో రైతు మత్తి సాంబశివరావుకు చెందిన వరికుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. శనివారం ఉదయం స్థానికులు నుంచి సమాచారం తెలుసుకున్న బాధిత రైతు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సీఐ ఈశ్వరరావు పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి బాలోత్సవ్ సంబరాలు

కోడూరు:మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి బాలోత్సవ సంబరాలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు తెలిపారు. స్వతంత్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు నాలుగు విభాగాల్లో క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు కబడ్డీ, నూండి, స్కిప్పింగ్, స్టిక్ రిలే, లెమన్ అండ్ స్పూన్, త్రోబాల్, రన్నింగ్, లాంగ్ జంప్, షాట్ పుట్ తదితర పోటీలు నిర్వహిస్తామని చెప్పారు.

ఆరు తడి పంట కోసం రైతుల పాట్లు

- ఇంజిన్లు పెట్టి నీటిని తోడుతూ మినుము పైరును తడుపుతున్న రైతన్న
- పురుగు పట్టకుండా గడ్డి మందు పిచికారీ
- ఆశాజనకంగా ఉన్న మినుము పైరును కాపాడుకునేందుకు యత్నం



చోడవరంలో మినుము పైరుకు ట్రాక్టరు ఇంజిన్‌కు మోటారు పెట్టి నీటిని తోడుతున్న దృశ్యం



గడ్డిమందు పిచికారీ చేస్తున్న కూడూరు రైతు

పెడన:ఆరుగాలం కష్టపడితే గానీ రైతు తాను వేసిన పంట చేతికి వచ్చే వరకు కంటిపై కునుకు లేకుండా నడుచుకుంటాడు. అటువంటి రైతు ఇప్పుడు రబీలో ఆరుతడి పంటలను వేసుకున్నాడు. మినుము పైరు బాగా ఏపుగా ఉండటంతో దానిని కాపాడుకునేందుకు మరింత ఆగచాట్లు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. కారణం ఆరుతడి కూడా లేని పరిస్థితులు నెలకొనడంతో ఆయా కాలువల్లోని అడుగునీరు, మురుగు కాలువల్లో ప్రవహిస్తున్న స్వీట్‌వాటర్, పంచాయతీ చెరువుల్లోని నీటిని తోడుకుంటూ మినుము పైరును కాపాడుకునే ప్రయత్నాల్లో రైతన్నలున్నారు.

ఆయిల్ ఇంజిన్లకు రూ.వెయ్యికిపైనే చెల్లింపులు...

అయిల్ ఇంజిన్లకు రూ.వెయ్యికిపైనే చెల్లించాల్సిన పరిస్థితులున్నాయని రైతులు వాపోతున్నారు. మరికొందరు ట్రాక్టర్లకు మోటారు ఇంజిన్లు ఏర్పాటు చేసి నీటిని తోడుకుంటున్నారు. నలుగురైదుగురు రైతులు కలిసి తమ పంటలను ఒక మోటారు ద్వారా తడుపుకునేలా చూసుకుంటున్నారు. ఎక్కడో దూరంగా ఉన్న కాలువలోని నీటిని లేదా చెరువులో నీటిని తోడుకోవాల్సి వస్తే అదనంగా పైపుకు సైతం కిరాయి రూ.వెయ్యికి పైగా చెల్లించాల్సిందే.

మినుము పైరుపై చీడపురుగులు...

మినుము పైరు ఆశాజనకంగా ఉందనున్న తరుణంలో రైతుకు పచ్చపురుగు, లద్దిపురుగు తదితర చీడ పురుగులతో పాటు తెగుళ్లు ఏమైనా సోకుతాయనే భయం రైతులను వెంటాడుతూనే ఉంటుంది. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా రైతులు తమ మినుము పైరుకు గడ్డిమందు పిచికారీ చేస్తున్నారు. ఒకసారి పిచికారీ చేసినందుకు రూ.1,500 నుంచి రూ.2వేలు వరకు ఖర్చుపెడుతున్నారు. ఈ విధంగా మినుము పైరు చేతికి వచ్చే వరకు కూడా ఎటువంటి తెగుళ్లు, పురుగులు ఆశించకుండా ఎనిమిది సార్లు మందులను పిచికారీ చేయాల్సి ఉంటుందని రైతులు పేర్కొవడం విశేషం. కొన్ని చోట్ల ఎలుకల బెడద విపరీతంగా ఉండటంతో ఎలుకలు పట్టే వారిని పిలిచి పంట పొలాల్లో బోన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ విధంగా బోన్లు ఏర్పాటు చేసి ఎలుక చిక్కితే ఒక్కో ఎలుకకు రూ.25 చెల్లించేలా రైతులు బోన్లు ఏర్పాటు చేసిన వారితో ఒప్పందం చేసుకుని ఎలుకల బెడదను రైతులు నిలువరించుకుంటున్నారు.

ఖర్చు తడిసి మోపెడవుతుంది



మినుము పైరు బాగుందని, దానిని కాపాడుకునేందుకు ఖర్చ మాత్రం తడిసిమోపెడవుతుంది. విత్తనాలు కొనుగోలు చేసి, దుక్కు దున్ని, విత్తనాలు జల్లి, ఆ విత్తనాలను తడుపుతూ రాగా పైరు బాగా ఏపుగా పెరిగింది. పచ్చపురుగు ఆశిస్తుండటంతో పురుగుమందు పిచికారీ చేస్తున్నాం. ఆరు తడి కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో పది మంది రైతులం కలిసి ట్రాక్టరుకు మోటారు ఇంజిను పెట్టి తద్వారా నీటిని తోడుతూ ఆరుతడి పెడుతున్నాం. తీరా పంట చేతికి వచ్చిన తరువాత మినుము ధర ఎలా ఉంటుందోననే భయం కూడా వెంటాడుతుంది. ఇప్పటికే ధాన్యం ధర గత ఏడాది కంటే బాగా తగ్గింది.

–ఊచ సురేష్, చోడవరం, పెడన మండలం

19 వేల ఎకరాలకు పైగా ఆరుతడి పంటలు



మండలంలో ఆరుతడి పంటలు 19 వేల ఎకరాలకు పైగా వేశారు. ప్రస్తుతం ఈ ఆరుతడి పంటలకు పురుగులు ఆశిస్తున్నాయని తమ దృష్టికి వచ్చింది. వారికి తగు సూచనలు ఇవ్వాలని వీఏఏలకు, ఎంపీఈవోలకు, ఏఈవోలకు తెలియజేశాం. అలాగే కొన్ని చోట్ల తెగుళ్ల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం ఆరుతడి పంటలు ఆశాజనకంగానే ఉన్నాయి. అక్కడక్కడ నీరు తడి కోసం రైతులు మోటారు ఇంజిన్లు ద్వారా తడుపుతున్నారు. ఆరు తడి ఉంటే చాలు పంట బాగానే పండుతుంది.

నూరున్నీసా,
ఇన్‌చార్జి ఏవో, పెడన మండలం

పాలకాయతిప్ప మెరైన్ ఎస్ఐగా పూర్ణమాధురి



కోడూరు:మండలంలోని పాలకాయతిప్ప మెరైన్ పోలీస్‌స్టేషన్ ఆఫీసర్‌గా పూర్ణమాధురి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహించిన జిలానీ ఏలూరు రేంజ్ డీఐజీ ఆదేశాలతో ఇక్కడ నుంచి రిలీవ్ అయ్యారు. నూతన ఎస్ఐ పూర్ణమాధురికి స్టేషన్ సిబ్బంది ఘనస్వాగతం పలికారు. బాధ్యతలు తీసుకున్న వెంటనే ఎస్ఐ హంసలదీవి సాగరతీరం వద్ద పరిస్థితులను పరిశీలించారు. ఎస్ఐ పూర్ణమాధురి భర్త చాణిక్య కోడూరు పోలీస్‌స్టేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

పేదల పాలిట పెన్నిధి వీఎం రంగా



బంటుమిల్లి:విజయవాడ దివంగత శాసనసభ్యుడు వంగవీటి మోహనరంగ పేదల హృదాయాల్లో చిరస్థాయిగా నిలిచారని మచిలీపట్నం ఎంపీ వి. బాలశౌరి తెలిపారు. మండలంలోని ములపర్రు గ్రామంలో రంగ అభిమానులు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి ఎంపీ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు ప్రసంగించారు. అనంతరం మండల పరిధిలోని మల్లంపూడి గ్రామంలో గత ప్రభుత్వం రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ఎంపీ, ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన గ్రామ సభలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీతారావమ్మకు నివాళి



సీతారావమ్మకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, నేతలు

చిట్టూర్పు(ఘంటసాల): గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు పూల సీతారావమ్మ (85) శనివారం రాత్రి స్వగృహంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు ఆదివారం సీతారావమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కొడాలి పీఏసీఎస్ మాజీ చైర్మన్, పార్టీ నేత పరుచూరి రామకృష్ణ పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. మృతురాలు సీతారావమ్మ కాంగ్రెస్ పార్టీలో పని చేస్తూ మహానేత వైఎస్సార్ పై ఉన్న అభిమానంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ సీపీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు కార్యకర్తగా కొనసాగుతూ పార్టీకి కట్టుబడి ఉన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు పరుచూరి రామకృష్ణ, దాసరి బసవ కుటుంబరావు, పోలవరపు రమేష్, పరుచూరి రాంబాబు, పరుచూరి శేషగిరిరావు, పాలకేంద్రం ప్రెసిడెంట్ దాసరి శివవెంకట సుబ్బయ్య, సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, స్థానికులు నివాళులర్పించారు.

నేడు పైడమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో మోహనరావు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆనందరావు

పెడన:పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీపైడమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద సోమవారం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో తిక్కిశెట్టి వీరవెంకట మోహనరావు తెలిపారు. ఆదివారం ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాట్లును ఆయన ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 11 గంటలకు అన్న సమారాధన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచనల మేరకు ఆలయంలో గతంలో కంటే ప్రస్తుతం అదనంగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. గతంలో ఆరు కౌంటర్లు ఏర్పాటు చేయగా ఇప్పుడు 8 కౌంటర్లు పెట్టామన్నారు. పెడన పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ అన్నసమారాధనకు హాజరై ప్రసాదం స్వీకరించి అమ్మవారి ఆశీస్సులను పొందాలని ఆయన కోరారు.

నేడు గణపతి సచ్చిదానంద స్వామి రాక

మచిలీపట్నంటౌన్:అవధూత దత్తపీఠాధీశ్వరులు గణపతి సచ్చిదానంద స్వామీజీ ఈ నెల 6వ తేదీ నగరానికి విచ్చేస్తున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి స్వామీజీ భక్తులకు మహాదర్శనం ఇవ్వనున్నారు. 7 తేదీ మంగళవారం నగరంలోని బుట్టాయిపేట దత్తాశ్రమంలో ఉదయం 10 గంటలకు జరిగే అత్రిదత్త రాగసాగర కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు దత్తాశ్రమంలో భక్త బృందం అన్ని ఏర్పాట్లు చేసింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్:గుడివాడ 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలోని 160 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సాంకేతిక మరమ్మతులు చేస్తున్నందున ఈ నెల 6వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 8వ తేదీ సాయంత్రం 6 గంటల వరకూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అకాశం ఉందని దీనికి వినియోగదారులు సహకరించాలని సున్న ఓ అండ్ ఎం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మరమ్మతుల కారణంగా ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని కానీ అత్యవసరమైతేనే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. 132 కేవీ పామర్రు, మచిలీపట్నం, అవనిగడ్డ, చిగురుకోట విద్యుత్ ఉప కేంద్రాల్లో అత్యవసరమైతేనే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

టైలర్స్ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

మచిలీపట్నంటౌన్:మచిలీపట్నం నగర టైలర్స్ సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జరిగిన ఆ సంఘ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. ఓ రెసిడెన్సీ మీటింగ్ హాల్లో నిర్వహించిన సమావేశంలో సంఘ అధ్యక్షుడిగా చండిక రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ అహద్, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ సలామ్, కోశాధికారిగా ముత్యాలపల్లి సత్యానారాయణ మరో 12 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ లీగల్ అడ్వైజర్‌గా న్యాయవాది లంకిశెట్టి బాలాజీని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కొప్పనాతి నాగరాజు వ్యవహరించారు. ఈ ఎన్నికలను సంఘ సీనియర్ నాయకులు ఇలియాస్‌పాషా, మస్తాన్ పర్యవేక్షించారు.

మోపిదేవికి పోటెత్తిన భక్తజనం



నాగపుట్టలో పాలుపోస్తున్న భక్తులు

మోపిదేవి:ప్రసిద్ధ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం ఆదివారం భక్తజనంతో పోటెత్తింది. తెలుగు ఉభయ రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో క్యూలైన్లన్నీ నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లివృక్షం, పొంగళిశాలల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డీసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో సూపరిటెండెంట్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీకాకుళేశ్వర స్వామి ఆలయంలో కుంకుమార్చన, లక్ష తులసీ పూజ



శ్రీకాకుళేశ్వర స్వామి వార్ల శాంతి కళ్యాణంలో పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు దంపతులు

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళంలో వేంచేసియున్న శ్రీ భూ సమేత శ్రీకాకుళేశ్వర స్వామి వారి ఆలయంలో కుంకుమార్చన, లక్ష తులసీ పూజలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయార్చకులు అగ్ని హోత్రం భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ రాజ్యలక్ష్మి భోగలక్ష్మి సమేత శ్రీకాకుళేశ్వర స్వామి వార్లకు శాంతి కల్యాణం, కుకుమార్చన, లక్ష తులసీ పూజలు చేశారు. పారిశ్రామికవేత్త విక్కుర్తి రాఘవయ్య ట్రస్టు చైర్మన్ విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు దంపతులు శాంతి కళ్యాణంలో పాల్గొని స్వామి వార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని విక్కుర్తి శ్రీనివాసరావు దంపతులు ప్రారంభించారు.

ద్విచక్ర వాహనాన్ని తగలబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టిన ద్విచక్ర వాహనం

పెడన:ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసిన ఘటన ఆదివారం రాత్రి పెడన పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని 17వ వార్డు పాతకూరగాయాల మార్కెట్ రోడ్డులోని శ్రీకోదండ రామాలయం వెనుక వీధిలో మెకానిక్ బాషా అనే వ్యక్తికి మూడంతస్తుల భవనం ఉంది. ఆయన హైదరాబాద్‌లో ఉంటారు. ఇక్కడ నిర్మించిన మూడు అంతస్తుల భవనంలో ఐడీఎఫ్‌సీ బ్యాంకు రికవరీ ఉద్యోగి దొర అనే యువకుడుతో పాటు మరో నలుగురు అద్దెకుంటున్నారు. వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంకు ఉద్యోగి గురించి ఆరా తీయడంతో లేరని తెలిసి కిందనున్న ద్విచక్రవాహనాన్ని కర్రలతో కొట్టి సైడ్ మిర్రర్లను పగులగొట్టి పెట్రోల్ పోసి తగులబెట్టారు. ద్విచక్ర వాహనాన్ని తగులబెట్టిన వారు బుల్లెట్ వాహనంపై వచ్చారని స్థానికులు పేర్కొవడం విశేషం. ఏం జరిగిందనే వాస్తవాలను పెడన ఏఎస్ఐ లక్ష్మణరావు, హెడ్‌కానిస్టేబుల్ శంకర్ విచారణ చేస్తున్నారు. అయితే జరిగిన సంఘటనపై ఎవరూ ఎటువంటి ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం





ఆత్మీయ కలయికతో సంతోషాలు పంచుకున్న పూర్వ విద్యార్థులు నాటి గురువులు రవీంద్రనాథ్, కోటేశ్వరరావును సన్మానించిన నాటి మహిళా శిష్యులు

నాగాయలంక:సంక్రాంతి సంబరాల నేపథ్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో 1977–78 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం సందడిగా సాగింది. 46 సంవత్సరాల తర్వాత పదో తరగతి క్లాస్‌మేట్స్ అందరినీ ఒకే తాటిపైకి తీసుకొచ్చే ప్రయత్నంగా జరిపిన ఆత్మీయ సమ్మేళనంలో 90 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. కుశల ప్రశ్నలతో నాటి తరగతి గదుల ముచ్చట్లును పరస్పరం పంచుకున్నారు. చాల మంది సతీ సమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అందుబాటులో ఉన్న గురువులు ఈదర రవీంద్రనాథ్ ప్రసాద్ (సైన్స్ టీచర్), డ్రిల్లు మాస్టర్ చందు కోటేశ్వరరావును సన్మానించారు. బ్యాచ్ ప్రముఖుల్లో అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే అంబటి శ్రీహరి ప్రసాద్, న్యాయవాది సనకా రఘురామ్, నిర్వాహక ప్రతినిధి, రిటైర్డ్ ఎంఈఓ భవిరి శంకరనాథ్ తదితరులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా వచ్చిన అంతర్జాతీయ మిమిక్రి కళాకారుడు భవిరి రవి తన మిమిక్రీతో అలరించారు.

అన్నదానం షెడ్ నిర్మాణానికి రూ.1.7 లక్షల వితరణ



షెడ్డు ప్రారంభించిన దాత ప్రకాశరావుతో అన్నదాన నిర్వాహక కమిటి ప్రతినిధి గడ్డిపాటి ప్రసాద్

నాగాయలంక:గ్రామంలోని బోసుబొమ్మ సెంటర్‌లో కొలువైన పోతురాజుస్వామి ఆలయం ప్రాంగణంలో గత మూడు సంవత్సరాలుగా అన్నదానం నిర్వహిస్తున్న సందర్భంగా దాతలు అన్నదానం షెడ్ నిర్మాణానికి రూ.1.7లక్షలు వితరణ చేశారు. గ్రామంలోని జల్లూరి ప్రకాశరావు–శ్రీకళ దంపతులు తండ్రి జల్లూరి గోపాలకృష్ణమూర్తి /జ్ఞాపకార్థం రూ.70 వేలు, యూఎస్ఏలో ఉంటున్న గ్రామస్తుడు గడ్డిపాటి శ్రీనివాసరావు రూ.37 వేలు అందించగా మొత్తం ఒక లక్షా ఏడు వేలు రూపాయలతో అన్న ప్రసాద నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో పేదల సౌకర్యార్థం ఈ షెడ్డు నిర్మించారు. ఆదివారం పేదలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం సందర్భంగా షెడ్డును లాంఛనంగా ప్రారంభించారు. అన్నదాన నిర్వాహక కమిటి ప్రతినిధి గడ్డిపాటి ప్రసాద్, సేవా కార్యకర్తలు ఉప్పల బుజ్జి, తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు క్రీడా పోటీలు

పర్రచివర(నాగాయలంక): పర్రచివర శివారు దీనదయాళపురంలో రక్షణ సైన్యం (సాల్వేషన్ ఆర్మీ) ఆధ్వర్యంలో జనవరి పండుగ పురస్కరించుకుని సంస్థ నిర్వహణలోని సండే పాఠశాల బాలలకు ఆదివారం వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. బహుమతి ప్రదానం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన మండల శ్రీకృష్ణదేవరాయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్ (చిన్నారి) చేతుల మీదుగా పోటీల్లో గెలుపొందిన 30 మంది చిన్నారులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నాగాయలంక రక్షణసైన్యం జిల్లాఅధికారి (డి.ఓ) మేజర్ తెలగతోటి ప్రసాదరావు, మహిళా విభాగం జిల్లా అధికారి మేజర్ దీనరత్నకుమారి తదితరులు తల్లిదండ్రులకు దిశానిర్దేశం చేశారు. సంస్థ ప్రతినిధులు వై.రాజా, వై.దేవి, డి.సుకన్య, అంకమ్మ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



సాగరతీరంలో పర్యాటకుల సందడి



కోడూరు:హంసలదీవి సాగరతీరం పర్యాటకుల సందడితో కళకళలాడింది. ఆదివారం సెలవుదినం కావడంతో సుదూర ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి తరలివచ్చారు. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు చెందిన పర్యాటకుల కోలాహలం అధిక సంఖ్యలో కనిపించింది. యువత తీరం వెంట బీచ్ కబడ్డీ ఆడుతూ సరదాగా గడిపారు. చిన్నారులు ఇసుకతిన్నెలపై సందడి చేశారు. పాలకాయతిప్ప మెరైన్ ఎస్ఐలు జిలానీ, పూర్ణమాధురిలో సిబ్బందితో కలిసి గస్తీ నిర్వహించారు. పర్యాటకులు సముద్రం లోపలకి వెళ్లకుండా జాగ్రత్తలు చెబుతూ అప్రమత్తం చేశారు.